
ప్రజాశక్తి
గురువారం 20 జులై 2023
5
పార్వతీపురం మన్యం



విద్యార్థులకు మెరిట్ కార్డులు జారీ

ప్రజాశక్తి - కలెక్టరేట్

విద్యార్థులకు నేషనల్ స్కాలర్ షిప్ మెరిట్ కార్డులను జారీ చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్. ప్రేమ్ కుమార్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఫిబ్రవరిలో జరిగిన నేషనల్ స్కాలర్ షిప్‌లో అర్హత పొందిన వారికి మెరిట్ కార్డులు జిల్లాకు చేరాయని, విద్యార్థులు గానీ, ఆయా పాఠశాలల సిబ్బంది డిఇఒ కార్యాలయానికి వచ్చి మెరిట్ కార్డులను పొందాలని సూచించారు. స్కాలర్ షిప్ కి ఎంపికైన ప్రతి విద్యార్థినీ, విద్యార్థులు జాతీయ బ్యాంక్‌లో విద్యార్థి పేరు, తల్లి లేదా తండ్రితో ఉమ్మడిగా ఖాతాను తెరవాలని, ఆధార్ కార్డు జత చేయాలని తెలిపారు. విద్యార్థి, తండ్రి పేరు, పుట్టిన తేదీ, మెరిట్ కార్డులో ఉన్నట్టే, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ పుస్తకం లో ఉండాలని, అప్పుడే స్కాలర్ షిప్ డబ్బులు ఖాతాలో జమ అవుతాయని వివరించారు. వివరాలకు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.



గిరిజనాభివృద్ధికి వారధి... చైతన్య రథసారథి

- ఆదివాసీల సమస్యలపై అలుపెరుగని పోరాటాలు సాగిస్తున్న ఎపి గిరిజన సంఘం
- నేటి నుంచి కురుపాంలో ఏడో జిల్లా మహాసభ



గిరిజనానికి రక్షణగా ఉన్న చట్టాల ఉల్లంఘణ ఓవైపు.. రాజ్యాంగం కల్పించిన హక్కుల కాలరాత మరోవైపు.. జీవనాధారమైన అడవుల నుంచి ఆదివాసీలను దూరం చేసే విధానాలు ఇంకోవైపు.. అమాయక గిరిజనానికి కాస్తోకూస్తో మేలు చేకూరుస్తున్న రిజర్వేషన్లను సైతం కొల్లగొట్టే కుట్రలు మరోవైపు.. ఇలా నలుదిక్కులా గిరిజనానికి ఉచ్చుబిగించి, ఊపిరిసల్పకుండా చేసే పాలకుల విధానాలకు వ్యతిరేకంగా పోరుబాట సాగిస్తోంది.. ఎపి గిరిజన సంఘం. ఏజెన్సీ ప్రాంతంలో అమాయక గిరిజనానికి అండగా నిలుస్తూ, నిత్యం చైతన్యం చేస్తూ, ఆదివాసీల అభివృద్ధికి వారధినవుతోంది. కేంద్ర, రాష్ట్ర పాలకుల అణచివేత చర్యలను ప్రతిఘటించి, గిరిజనులకు బాసటనిస్తోంది. అలాంటి గిరిజన సంఘం మహాసభ... గురు, శుక్రవారాల్లో జరగనుంది. గత పోరాటాలపై సమీక్షించుకుని, భవిష్యత్తు పోరాట కార్యాచరణను రూపొందించుకునేందుకు సర్వం సిద్ధమైంది.

ప్రజాశక్తి - సాలూరు/కురుపాం

2020 జనవరి రెండో తేదిన జరిగిన ఎపి గిరిజన సంఘం ఆరో జిల్లా మహాసభలో తీసుకున్న కర్తవ్యాలను అమలు చేసి, గిరిజన హక్కుల రక్షణకు ముందుండి పోరాడింది. అందులో భాగంగానే రాజకీయంగా, ఆర్థికంగా సామాజికంగా ముందంజలో ఉన్న బోయ, వాల్మీకులను ఎస్‌టిలో చేరుస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున గిరిజన సంఘం పోరాడింది. దీనిపై గిరిజనులను సమీకరించి మన్యం బంద్ విజయవంతంగా చేపట్టింది. ఐటిడిఎల వద్ద ఆందోళన కార్యక్రమాలు నిర్వహించింది. ఏజెన్సీ ప్రాంతంలో ఉద్యోగాలను గిరిజనులకే కేటాయింపునకు సంబంధించిన జిఒ నెంబర్ 3 రద్దుకు వ్యతిరేకంగా దశల వారీగా ఆందోళనలు చేపట్టింది. ఐటిడిఎల వద్ద రిలే నిరాహార దీక్షలు నడిపింది. గిరిజన ప్రాంతంలో జీడి పంటకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ 1500మంది గిరిజనులతో కలెక్టర్ కార్యాలయం వద్ద మహాధర్నా నిర్వహించింది. సాలూరు మండలం కురుకూటిలో హైడ్రో పవర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా గిరిజన సంఘం ఆందోళన కొనసాగించింది. గిరిజనుల నుంచి వన్‌టైం సెటిల్మెంట్ కింద గృహ నిర్మాణ శాఖ వసూళ్లకు వ్యతిరేకంగా పోరాడింది. కురుపాంలో గిరిజన ఇంజనీరింగ్ కళాశాలకు భూములిచ్చిన గిరిజన రైతులకు పరిహారం చెల్లించాలని, భూమికి భూమి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పోరాడింది. దీనిపై పాలకొండ ఆర్‌డిఒ జోక్యం చేసుకుని భూమికి భూమి ఇవ్వడానికి అంగీకారం తెలిపారు. భామిని ప్రాంతంలో గిరిజనులు ఇళ్ల నిర్మాణానికి ప్రయత్నాలు చేస్తే రిజర్వ్ ఫారెస్ట్ భూములని అటవీ శాఖ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై పోరాటం చేపట్టింది. గిరిజనులు వ్యవసాయ, అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ సీతంపేట, పార్వతీపురం ఐటిడిఎల వద్ద గిరిజన సంఘం ఆధ్వర్యాన ధర్నాలు నిర్వహించారు. సవర భాషా వాలంటీర్లను రెగ్యులర్ చేయాలని, వేతనం బకాయిలు చెల్లించాలని గిరిజన సంఘం పోరాడింది. మన్యం జిల్లాలో ఏనుగుల బెడద నుంచి గిరిజనులను, పంటలను కాపాడాలని పోరుబాట పట్టింది.

పాచిపెంట మండలం ఒడిసెలమడ గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలని ఆందోళన చేపట్టింది. 1/70 చట్టాన్ని రద్దుచేసి గిరిజన ప్రాంతాన్ని అంతటిని మైనింగ్ పేరుతో కార్పొరేట్లకు అప్పజెప్పడాన్ని నిరసిస్తూ ఆందోళనలు చేసింది. కురుపాం నియోజకవర్గంలో పూర్ణపాడు-లాబేసు వంతెన వెంటనే పూర్తి చేయాలని, గిరిజన గ్రామాలకు అన్నిటికీ లింక్ రోడ్లు ఏర్పాటు చేయాలని, జీడిపిక్కలు, చింతపండు ప్రాసెస్ యూనిట్లు పెట్టాలని, గిరిజన ప్రాంతంలో ఉన్న చెక్ డాములు వెంటనే పూర్తి చేయాలని, విద్య, వైద్యం మెరుగుపర్చాలని.. ఇలా అనేక సమస్యలపై గిరిజన సంఘం పోరాటాలు సాగించింది. వీటిలో కొన్ని సమస్యలు పరిష్కారమయ్యాయి. ఇంకా కొన్ని అపరిష్కృతంగా ఉన్నాయి. ఈ సమస్యలపై మహాసభలో భవిష్యత్తు కార్యాచరణ రూపొందించనున్నారు.

మహాసభకు ముస్తాబైన వేదిక

కురుపాం : గిరిజన సంఘం ఏడో జిల్లా మహాసభకు కురుపాం వేదికైంది. స్థానిక ఆర్‌టిసి కూడలి వద్ద గురు, శుక్రవారాల్లో జరిగే మహాసభకు జిల్లాలోని అన్ని గిరిజన మండలాల నుంచి గిరిజనులు పెద్ద ఎత్తున హాజరుకావాలని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి మండంగి శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షులు మండంగి రమణ కోరారు. గురువారం ఉదయం 10 గంటలకు ఆర్‌టిసి కాంప్లెక్స్ నుండి రావాడ కూడలి వరకు ర్యాలీ నిర్వహిస్తున్నారు. అనంతరం ప్రతినిధుల సభ కాంప్లెక్స్ ఆవరణలో జరుగుతుంది. ఈ మహాసభకు ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ అధ్యక్షులు మిడియం బాబూరావు, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం, విశాఖ జిల్లా అధ్యక్షులు అప్పారావు, సిఐటియు రాష్ట్ర నాయకులు కె.సుబ్బరావమ్మ హాజరు కానున్నారు. ఈ మేరకు ఏర్పాట్లలో గిరిజన సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం సిఐటియు, ఎస్‌ఎఫ్‌ఐ, కెవిపిఎస్ నాయకులు రెడ్డి వేణు, పి.తిరుపతిరావు, గంగరాజు, జగదీష్, కొల్లి గంగునాయుడు, అవినాష్, మండంగి వెంకట్రావు, ఎన్.సింహాచలం నిమగ్నమై ఉన్నారు.



మహాసభల వేదికను ముస్తాబు చేస్తున్న గిరిజన సంఘం నాయకులు



ఎమ్మెల్యే కారును అడ్డుకుంటున్న యువకులు

ఎమ్మెల్యేకు నిరసన సెగ

సమస్యలపై జోగారావును నిలదీసిన యువత

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మండలంలోని డికె పట్నంలో బుధవారం స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు నిరసన సెగ తగిలింది. దీర్ఘకాలంగా తమ గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని యువత నిలదీసింది. దీంతో సమాధానాన్ని దాటవేసి వెళ్లిపోయిన ఎమ్మెల్యే కారుకు అడ్డంగా నిలబడి నిరసన తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించిన విరాలిలా ఉన్నాయి. మండలంలోని డికె పట్నంలో స్థానిక తహశీల్దార్ కె.శివన్నారాయణ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే జోగారావును గ్రామానికి చెందిన యువత తాగునీటి సమస్యపై నిలదీశారు. వీరి ఆందోళనకు జనసేన కార్యకర్తలు తోడయ్యారు. చాలా కాలంగా తాగునీటి సమస్య మీ దృష్టికి తీసుకొచ్చామని, సమస్య ఎప్పుడు పరిష్కరిస్తారంటూ ఎమ్మెల్యేను నిలదీశారు. దీంతో ఎమ్మెల్యే కార్యక్రమం ముగిసిన తర్వాత ప్రత్యేకంగా దీనిపై వివరణ ఇస్తానని తెలిపారు. అయితే కార్యక్రమం ముగిసిన తర్వాత ఎమ్మెల్యే తన వాహనంలో డోకిశీలలో జరిగే కార్యక్రమానికి ఆదరాబాదరాగా బయలుదేరారు. సమాధానం చెప్పకుండా ఎమ్మెల్యే వెళ్లిపోవడమేమిటని జనసేన కార్యకర్తలు, యువకులు ఆగ్రహించారు. దీనికి పరిష్కారం వెంటనే సూచించాలని ఎమ్మెల్యే వాహనానికి అడ్డంగా నిలబడ్డారు. దీంతో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు రంగ ప్రవేశం చేసి కార్యకర్తలను తొలగించి ఎమ్మెల్యే వాహనాన్ని పంపారు. దీంతో కార్యకర్తలు, యువకులు మరింత అసహనాన్ని తహశీల్దార్ శివన్నారాయణ ముందు ప్రదర్శించారు. దీంతో తహశీల్దార్ మోసూరు శ్రీరాములు, పెంట రామకృష్ణ, ముంగి రాంబాబు, రాయిపల్లి రమేష్ అనే వారిపై విధులకు ఆటంకం కలిగించారని రూరల్ పోలీస్ స్టేషన్లో మౌఖికంగా ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన సిఐ స్వామినాయుడు నేతృత్వంలో నలుగురు యువకులను స్టేషన్‌కు రప్పించారు. ఈ విషయం తెలుసుకున్న జనసేన నియోజకవర్గ నాయకులు చందక అనిల్, వి.దాలినాయుడు, ఆరిక మోహనరావు, తదితరులతోపాటు భారీ సంఖ్యలో జనసేన కార్యకర్తలు పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. దీంతో పోలీసులు నలుగురి దగ్గర వ్యక్తిగత పూచికత్తు తీసుకొని విడుదల చేయడంతో సమస్య సద్దుమణిగింది.

మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి -పాలకొండ



కరపత్రాలను విడుదల చేస్తున్న మున్సిపల్ కార్మికులు

మున్సిపల్ ఆప్కాస్ సిబ్బంది అందర్నీ రెగ్యులర్ చేయాలని, ఇతర సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా దశల వారీగా చేపడుతున్న అందోళన కార్యక్రమాలు జయప్రద చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) పాలకొండ కమిటీ ఆధ్వర్యంలో కరపత్రాలను బుధవారం స్థానిక నగరపంచాయతీ కార్యాలయ ఆవరణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఆఫీసుల వద్ద జూలై 20, 21వ తేదీల్లో రిలే నిరాహార దీక్షల్లు, 27న మున్సిపల్ ఆఫీస్ ముట్టడి, ఆగస్టు 7న కలెక్టరేట్ ముట్టడి ఉంటున్నారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే ఆగస్టు 15 తర్వాత రాష్ట్ర వ్యాప్త నిరవధిక సమ్మెకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ కార్మికులు చేస్తున్న దశల వారీ ఆందోళన కార్యక్రమానికి అన్ని వర్గాల వారు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు పదాల భాస్కరరావు, సిహెచ్.సంజీవి, పడాల వేణు, వై.హరిబాబు, టి.ఈశ్వర్య కుమార్, బి.సురేష్, జి.నారాయణరావు, ఎస్.బాబురావు తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్యతా భవనాలను పూర్తిచేయాలి

ప్రజాశక్తి -కొమరాడ

ప్రాధాన్యతా భవనాలను త్వరగా పూర్తి చేయాలని ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్ అన్నారు. మండలంలోని దుగ్గిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించి చిన్నారులతో మాట్లాడారు. పిల్లలకు పౌష్టికాహారం అందించాలని అంగన్వాడీ కార్యకర్తకు పలు సూచనలు చేశారు. అనంతరం మండల ప్రజా పరిషత్ పాఠశాలను తనిఖీ చేసి రిజిస్టర్, జివికె కిట్లు, నాడు నేడు పనులను పరిశీలించారు. నాణ్యమైన విద్యాభోదన ఉండాలని, ప్రతి రోజు మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం పిల్లలకు అందించాలని ఎంఇఒను పిఒ ఆదేశించారు. అనంతరం కల్లికోటలో గ్రామ సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాల భవనాలు, వెల్నెస్ సెంటర్ల నిర్మాణాలను పరిశీలించిన త్వరితగతిన పనులు పూర్తిచేయాలని పంచాయతీ రాజ్ డిఇఇ, ఇంజనీరింగ్ అధికారులను పిఒ ఆదేశించారు.

రైతుబజార్‌ను వినియోగంలోకి తేవాలి

డిప్యూటీ సిఎంకు ప్రజాసంఘాల వినతి

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలో నిర్మించిన రైతు బజారును వినియోగంలోకి తీసుకురావాలని కోరుతూ పట్టణ పౌర సంక్షేమ సంఘం, ఎపి గిరిజన సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. బుధవారం డిప్యూటీ సిఎం రాజన్నదొరను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు రైతు బజారు నిర్మించి ఐదేళ్ళవుతున్నా ఇంతవరకూ దాన్ని వినియోగంలోకి తీసుకొని రాలేదని, పట్టణ ప్రజలు నిత్యావసర వస్తువుల కొనుగోలులో దోపిడీకి గురవుతున్నారని చెప్పారు. మార్కెట్లో కిలో టమాటో 150రూపాయల పైనే వుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కిలో 50రూపాయలకు పంపిణీ చేయనున్నట్లు సాలూరులోనూ విక్రయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే శాఖా గ్రంథాలయం చాలా ఏళ్ల నుంచి అద్దె భవనంలోనే నడుస్తోందని, సొంత భవనం మంజూరుకు స్థలం కేటాయించాలని కోరారు. ప్రభుత్వ ఐటిఐ కూడా గత 12ఏళ్లుగా అద్దె భవనంలో నడుస్తోందని, సొంత భవనం నిర్మాణానికి స్థలం చూపించాలన్నారు. పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ ఎన్వైనాయుడు, ఎపి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సీదరపు అప్పారావు, మండల అధ్యక్షులు జి.జానకీరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



డిప్యూటీ సిఎం రాజన్నదొరకు సమస్యను వివరిస్తున్న ప్రజాసంఘాల నాయకులు



సచివాలల సిబ్బందితో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కల్పనకుమారి

గిరిజన గ్రామాల్లో పిఒ పర్యటన

భవన నిర్మాణాల నాణ్యతా లోపాలపై ఆగ్రహం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని దోనుబాయి, దారపాడు, చిన్నపల్లంకి, పెద్దపల్లంకి గ్రామాల్లో ఐటిడిఎ పిఒ కల్పనకుమారి బుధవారం పర్యటించారు. దారపాడులో రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కేంద్రం నాణ్యతా లోపాలు ఉండడాన్ని గమనించారు. అలాగే దోనుబాయి రైతు భరోసా కేంద్రాన్ని కూడా పరిశీలించారు. అక్కడ కూడా నాణ్యతా లోపాలు ఉండడంపై సంబంధిత ఎఇ, ఇంజనీరింగ్ అసిస్టెంట్, వర్క్ ఇన్స్పెక్టర్లకు మెమోలు జారీ చేయాలని ఆదేశించారు. అంతేకాక వారం రోజుల్లో చివరిదశ పనుల్లో ఉన్న భవనాలను వెంటనే పూర్తి చేసి అప్పగించాలన్నారు. దోనుబాయి గ్రామ సచివాలయ భవనం పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. చిన్నపల్లంకి, పెద్ద పల్లంకి గ్రామాలను పరిశీలించారు. చిన్నపల్లంకిలో మలేరియా, డెంగీ కేసులు ఎక్కువగా ఉన్నప్పటికీ రిపోర్టులో తక్కువ కేసులు ఉన్నట్టు చూపించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై మెడికల్ ఆఫీసర్, ఎఎన్ఎం, సిహెచ్‌డబ్ల్యు, ఎంఎల్‌హెచ్‌పి, పంచాయతీ సెక్రటరీలపై చర్యలు తీసుకోవాలని సంబంధించిన అధికారులకు ఆదేశించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని, మెడికల్ క్యాంపు నిర్వహించాలని అన్నారు. గ్రామంలో మళ్లీ మలేరియా, డెంగీ కేసులు రాకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రయోగశాల పరికరాల సరఫరాకు టెండర్లు

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ప్రయోగశాల పరికరాలు, రాపిడ్ టెస్ట్ కిట్లు, ఇతర పరికరాలు సరఫరా చేసేందుకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు 42 రకాల ప్రయోగశాల పరికరాలు, రాపిడ్ టెస్ట్ కిట్లు, ఇతర పరికరాలు అవసరమని ఆయన చెప్పారు. ఆయా పరికరాలను టెండరు ప్రక్రియ ద్వారా సమకూర్చడం జరుగుతుందని స్పష్టం చేశారు. టెండరు దరఖాస్తులను https://Parvathipurammanyam.ap.gov.in వెబ్ సైట్ నుండి పొందవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈనెల 20నుంచి ఆగస్టు 3 వరకు అందుబాటులో ఉంటుందని ఆయన తెలిపారు. టెండర్ దరఖాస్తులను ఆగస్టు 3 వరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్వీకరించడం జరుగుతుందని ఆయన చెప్పారు. వివరాలకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో సంప్రదించవచ్చని ఆయన సూచించారు.

శివారు భూములకు సాగునీరందేనా?

- వర్షాలపై ఆధారం
- సాగునీటి కోసం అవస్థలు
- పట్టించుకోని నీటిపారుదల శాఖ అధికారులు

ప్రజాశక్తి - వీరఘట్టం

అన్నీ ఉన్నా అల్లుడు నోట్లో సున్నా అన్న చందంగా ఉందని మండలంలోని రైతాంగం పరిస్థితి. మండలం చుట్టూ నదులు, సాగునీటి కాలువలు ఉన్నప్పటికీ శివార ప్రాంతాల భూములకు సాగునీరు అందకపోవడంతో ప్రతి ఏటా సాగునీరు కోసం అన్నదాతలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తోటపల్లి ప్రధాన ఎడమ కాలువ పరిధిలోని రాయవలస నుంచి మొదటి కెనాల్ ద్వారా కడకల్లా, నడిమికెల్లా, విక్రంపురం, చిట్టిపూడివలస, నడుకూరు, కొట్టుగుమ్మడ, గడగమ్మ గ్రామాలకు సాగునీరు రావాల్సి ఉంది. ఈ గ్రామాలను దాటుకొని గడగమ్మకు వచ్చేసరికి అడుగు నీరే వస్తుంది. దీంతో మోటర్లు సదుపాయం ఉన్న రైతులు వాటిపై ఆధారపడి పంటలు సాగు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఏ అవకాశం లేని వారు వర్షాలపై ఆధారపడి పంటలు సాగు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. వరుణుడు కరుణిస్తే కాస్తాకూస్తో పంట చేతికి వస్తుందని, లేకుంటే పెట్టిన పెట్టుబడులు కూడా రావడం లేదని, అప్పుల పాలవుతున్నట్లు అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల పంట భూములు బీడు భూములుగా మారుతున్నాయి. ఇదే ప్రధాన ఎడమ కాలువ ద్వారా సెవెంత్ బ్రాంచి హుస్సేన్‌పురం గ్రామ జంక్షన్ నుంచి తూడి, రేగులపాడు, యు.వెంకంపేట, పివిఆర్ పురం, చిదిమి వంటి గ్రామాల పంట భూములకు సాగునీరు సరఫరా కావాల్సి ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో సాగునీరు సరఫరా కాకపోవడంతో అన్నదాతలు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శివార ప్రాంతమైన పివిఆర్ పురం రైతులకు ప్రతి ఏటా సాగునీటి కోసం అవస్థలు తప్పడం లేదు. దీంతో వర్షాలపైన ఆధారపడి పంటలు సాగు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

సాగునీటి గగనమే

మండలంలోని ప్రతి ఏటా 16వేల ఎకరాలకు పైబడి వరి పంట సాగుతున్నట్లు వ్యవసాయ అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. అయితే ఈ ఏడాది కూడా తోటపల్లి ప్రధాన ఎడమ కాలువ ఆధునీకరణ పనులు పూర్తి కాకపోవడంతో సాగునీటికి గగనమే ఉంటూ ఆయా ప్రాంతాలకు చెందిన అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కాలువ ఆధునీకరణ పనులు పూర్తయితే ఏడాదికి రెండు పంటలు సాగు చేసుకోవచ్చునని, ఆ దిశగా ప్రజా ప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని రైతులు కోరుతున్నారు. ప్రస్తుతం కత్తుల కవిటి, హుస్సేన్ పురం గ్రామాల మధ్య కాలువ లైనింగ్ పనులు మాత్రమే జరిపారు. ఈనెల 20న సర్దార్ గౌతు లచ్చన్న రిజర్వాయర్ (తోటపల్లి బ్యారేజీ) నుండి సాగునీరు విడిచి పెట్టేందుకు అధికారులు ముహూర్తం ఖరారు చేశారు. ఈ సమయంలోనైనా ఈ భూములకు సాగునీరు విడిచిపెట్టాలని ఈ ప్రాంత అన్నదాతలు అధికారులు, పాలకులను వేడుకుంటున్నారు.



కత్తుల కవిటి -హుస్సేన్ పురం గ్రామాల మధ్య చేపట్టిన కాలువ లైనింగ్ పనులు

నష్టాలు చూస్తున్నాం

తోటపల్లి ప్రధాన కాలువ ద్వారా సాగునీరందక, సకాలంలో వర్షాలు కురువక వేసిన పంటలు పండక నష్టాలు చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కావున అధికారులు స్పందించి కాలువ ద్వారా సాగునీరందించేలా చర్యలు తీసుకోవాలి.

ఆర్. వెంకటరమణ,
రైతు, గడగమ్మ

మోటారే ఆధారం

కాలువ ద్వారా సాగునీరు రాకపోవడంతో మోటర్‌పైనే ఆధారపడి పంటలు సాగు చేయాల్సిన పరిస్థితి. ఎగువ ప్రాంతమైన తూడి గ్రామ రైతులు దిగువకు నీరు రాకుండా ఎక్కడికక్కడే పూనులు వేయడంతో దిగువకు చుక్క నీరు రావడంలేదు. దీంతో మోటార్ల సహాయంతో పంటను సాగు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

బి అప్పలనాయుడు
రైతు, పివిఆర్ పురం

కాలువ ఉండీ ఫలితం లేదు

కాలువ ఉండీ కూడా చుక్క నీరు దిగువకు రావడం లేదు. వరుణుడు కరుణ చూపితే పంట చేతికి వస్తుందని, లేకుంటే అంతే పరిస్థితి. ప్రతి ఏట సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. నీరందక కళ్లముందే పంట నాశనమైపోతుంది. సమస్య పరిష్కరించాలని పలుమార్లు ప్రజా ప్రతినిధులు దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోయింది.

ఉదయాన అప్పలనాయుడు,
రైతు, పివిఆర్ పురం

99శాతం సాగునీటిని సరఫరా చేస్తాం

ఈ ఏడాది శివార ప్రాంతాలకు 99 శాతం సాగునీటిని సరఫరా చేసేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకు సంబంధించి ఇప్పటికే కాలువను బాగు చేశాం. రైతులు సాగునీటి కోసం అవస్థలుపడాల్సిన అవసరం లేదు. పడవలసిన అవసరం లేదు.

డి.వెంకటరమణ,
ఇరిగేషన్ జెఇ,

సంక్షేమ పథకాలను దరి చేర్చేందుకే సురక్ష



లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు దరి చేసేందుకే జగనన్న సురక్ష పథకం లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే ఎ.జోగారావు అన్నారు. పట్టణంలోని శంభావీధి, రాజుగారికోట, బొగ్గులవీధి సచివాలయాలం పరిధిలో గల 23, 23, 25, 26, 27, 28, 29 వార్డులకు చెందిన ప్రజలకు జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ కార్యక్రమం మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఆర్య వైశ్య పంక్షన్ హాల్ బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మూడు సచివాలయాల పరిధిలో గల జగనన్న సురక్ష పథకం ద్వారా జారీ చేసిన 11రకాల ధ్రువీకరణ పత్రాలను సుమారుగా 1500 మందికి పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏ ఒక్కరు, ఏ కుటుంబమూ సంక్షేమ పథకాలు దూరం కాకూడదన్న ఏకైక లక్ష్యంతో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందజేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బి గౌరీశ్వరి, వైస్ ఛైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, మాజీ వైస్ ఛైర్మన్ బెలగాం జయబాబు, స్థానిక వార్డుల కౌన్సిలర్లు మంత్రి ఉమామహేశ్వరి, మజ్జి శశికర్, నిమ్మకాయల సుధీర్, వై.త్రినాథ, తాడి శంకరరావు, ఎస్.లావణ్య, జెసిఎస్ కన్వీనర్ జి.మాధవరావు, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు, వైసిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు, సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : మండలంలోని డోకిశీల, డికె పట్నం సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు సుమారు 1200 మంది లబ్ధిదారులకు వివిధ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎస్.రమేష్, తహశీల్దార్ శివన్నారాయణ, ఇఒపిఆర్‌డి ఎస్.కృష్ణుడు, ఎంపిపి మజ్జి శోభారాణి, వైస్ ఎంపిపిలు సిద్దా జగన్నాధరావు, బంకురు రవికుమార్, ఆత్మ ఛైర్మన్ బి.తిరుపతిరావు, మండల పార్టీ అధ్యక్షులు, బొమ్మి రమేష్ నాయకులు, భీమవరపు కృష్ణమూర్తి మడక విశ్వనాథం, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు, లబ్ధిదారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

కురుపాం : మండలంలోని ఉలికొండ పంచాయతీ పొడ్డిక సచివాలయం వద్ద జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి బి.సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు అర్హులై ఉండీ ఇంకా మిగిలిన వారు జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తు చేసుకుంటే వెంటనే పరిష్కారమవుతుందని, కావున లబ్ధిదారులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వి వి శివ రామయ్య, ఉప తహశీల్దార్ నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

వండువలో నేడు జగనన్న సురక్ష

వీరఘట్టం : మండలంలోని వండువ, సంతనర్సిపురంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ జె.జయంత్‌ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులంతా సమయం పాటించి ఉదయం 10 గంటలకు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

రాష్ట్ర గిరిజన జాతరకు ఆహ్వానం

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్ర గిరిజన జాతర మహోత్సవాలకు డిప్యూటీ సిఎం రాజన్నదొరను ఆహ్వానించారు. ట్రైబల్ కల్చరల్ రీసెర్చ్ ట్రైనింగ్ మిషన్ ఆధ్వర్యంలో ఈనెల 22, 23 తేదీల్లో విశాఖపట్నంలోని విఎంఆర్‌డిఎ చిల్డ్రన్ థియేటర్‌లో నిర్వహించనున్న ఉత్సవాలకు రావాలని కోరుతూ నిర్వాహకులు ఆహ్వానం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన చేత గోడపత్రికలను విడుదల చేశారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఏటా గిరిజన జాతర మహోత్సవాలు నిర్వహిస్తారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - సీతంపేట

ఒంగోలులో గిరిజన యువకుడ్ని చావబాది మూత్రం పోసిన 9 మంది దుండగులపై కఠినంగా చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి బి.సాయి డిమాండ్ చేశారు. మధ్యప్రదేశ్‌లో జరిగిన సంఘటన మరువకముందే నేడు ఒంగోలులో చోటు చేసుకోవడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా దోషులను కఠినంగా శిక్షించాలని జిల్లా అధ్యక్షులు జీలకర్ర శ్రీరాములు డిమాండ్ చేశారు.

గెస్ట్ అధ్యాపకులను సత్వరమే విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ప్రభుత్వ జూనియర్ గెస్ట్ అధ్యాపకులను సత్వరమే విధుల్లోకి తీసుకోవాలని, వీరి తొలగింపు నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆయనతో పాటు సిపిఐ నాయకులు గరుగుబిల్లి సూరయ్య, కూరంగి గోవిందు నాయకులు లతో కలిసి మీడియా మాట్లాడారు. పదేళ్ల నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గెస్ట్ అధ్యాపకులుగా పనిచేస్తున్న వేలాదిమంది లెక్చరర్లను తొలగిస్తున్నట్లు, వారి స్థానంలో కొత్తగా నోటిఫికేషన్ ఇస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని, ఈ నిర్ణయాన్ని సత్వరమే రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకుని, తొలగించిన అధ్యాపకులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ తొలగింపు కారణంగా వేలాది కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతారని, దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని వారు అన్నారు. తక్షణమే ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, లేనిచో అధ్యాపకుల పక్షాన ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు.



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న జయకృష్ణ

మేనిఫెస్టో ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

టిడిపి మేనిఫెస్టోను ప్రజల్లోకి క్షేత్రస్థాయిలో తీసుకెళ్లడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని తెలుగుదేశం పార్టీ పాలకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నిమ్మక జయకృష్ణ పిలుపునిచ్చారు. భవిష్యత్తుకు గ్యారెంటీ మహాశక్తి చైతన్య రథాన్ని మంగళవారం నియోజకవర్గ మహిళలు, నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్నెన అప్పలనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు గండి రామినాయుడు, ఎస్టీ సెల్ అధ్యక్షులు జీలకర్ర మోహన్‌రావు, బొప్పడ దొర, కోట సంగంనాయుడు, మహిళనేతలు కర్నెన యోగిత, గండి పద్మ, కోట భవని, పార్వతి, పలువురు మహిళా నాయకులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై ప్రచారం చేయాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ప్రకృతి వ్యవసాయం సాగుపై విస్తృత ప్రచారం చేయాలని ప్రకృతి వ్యవసాయ రీజనల్ అధికారి కె.ప్రకాష్ తెలిపారు. మండలంలోని ఎంఆర్ నగరం, బాలగుడబలో బుధవారం ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో వేసిన నవధాన్యాలు సందర్శించారు. అనంతరం ప్రకాష్ మాట్లాడుతూ ప్రకతి వ్యవసాయ పద్ధతులు పాటించిన రైతులకు ఎస్2ఎస్ కిట్లు తయారు చేసి సకాలంలో అందజేయాలన్నారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అదేవిధంగా రైతుభరోసా కేంద్రం ద్వారా ప్రకృతి వ్యవసాయ విస్తరణ జరగాలన్నారు. ప్రకతి వ్యవసాయ ఉత్పత్తులు కేంద్రంలో కషాయాలు, ద్రావణాలు రైతులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ మానస మరియు ఐసిఆర్పీలు, రైతులు పాల్గొన్నారు.

మెలకువలు పాటించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రంటలు సాగు చేసేటప్పుడు కొన్ని మెలికవలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి జక్కువ సౌజన్య రైతులకు సూచించారు. మండలంలోని తెట్టంగిలో బుధవారం పొలంబడి కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నారుమళ్లలో సస్యరక్షణ చర్యలను వివరించారు. జీలుగు వేసిన రైతులు కలియన్ని సూపర్ ఎకరాకు మూడు బస్తాలు చొప్పున వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

సబ్సిడీపై చిరుధాన్యాల విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి - సాలూరురూరల్

కొర్ర, రాగి, కంది విత్తనాలను 100శాతం సబ్సిడీపై రైతులకు వైస్ ఎంపిపి రెడ్డి సురేష్ అందజేశారు. మండలంలోని పెదపదం, గాదెలవలస, బాగువలసలో బుధవారం ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ మండలంలోని 22పంచాయతీ గ్రామ సచివాలయాల పరిధిలో గల రైతులందరికీ 100 శాతం సబ్సిడీపై రాగి, కొర్ర, కంది విత్తనాలను ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తుందన్నారు. ముఖ్యంగా ఆర్ఒఎఫ్ఆర్ రైతులకు రాగి, కొర్రలను అందిస్తామని, కంది విత్తనాలను మిగతా రైతులందరికీ ఇస్తున్నామని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల వ్యవసాయాధికారి అనురాధ పండా మాట్లాడుతూ రాగి, కొర్రలు పోడు వ్యవసాయంలో వేయడం వల్ల మైదాన ప్రాంతంలో పండే పంటల కన్నా ఎక్కువ దిగుబడి వస్తుందన్నారు. వీటికి కూడా మంచి ధర వస్తుందని తెలిపారు. కంది పంటను ప్రధాన వ్యవసాయ పంటల్లో అంతర్ పంటగా వేసుకోవడం వల్ల క్రిమి, కీటకాలు నుండి రక్షణ పొందవచ్చునని, ఆదాయం కూడా పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ, సిబ్బంది రైతులు పాల్గొన్నారు



రైతులకు విత్తనాలు అందజేస్తున్న వైస్ ఎంపిపి రెడ్డి సురేష్



గిరిజనులంతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి

ప్రజా సంక్షేమం కోసమే గడపగడపకు..

ప్రజాశక్తి - సీతంపేట

ప్రజా సంక్షేమం కోసమే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని కీసరజోడు సచివాలయ పరిధిలో కీసరజోడు, మర్రిమానుగుడ, కొంజరగూడ, కారిగూడ, లోతుగూడ, గొర్రిమడ, దిబ్బగూడ, నిడిమిగూడ, దిగువ కలువరాయి, ఎదురువలస, ఎదురువాడ, తాబేలువలస, బొక్కుడుగూడ గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు ఏఏ స్థాయిలో , ఏఏ వర్గాలకు, చెందుతున్నాయో, ఏమాత్రం అందుతున్నాయి అన్న అంశంపై ఎమ్మెల్యే గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అలాగే ఇంకా ఎవరైనా అర్హులకు పథకాలు అందకపోతే తక్షణమే సంబంధిత సచివాలయాల్లో అధికారులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎపిపి బిడ్డిక ఆదినారాయణ, పాలకొండ ఎఎంసి చైర్మన్ హిమరక మోహనరావు, స్థానిక సర్పంచ్ సన్నాపురం రవి, ఎంపిటిసి సభ్యులు సవర మంగయ్య, నిమ్మక హరిప్రసాద్, ఎంపిడిఒ కె.సత్యం, కార్యదర్శి అప్పలసూరి, సచివాలయ సిబ్బంది, మండల ఉన్నత స్థాయి అధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గర్భిణులకు పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న సిపడిపిఒ అనంతలక్ష్మి

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి - పాచిపెంట

పౌష్టికాహారం తోనే తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని స్థానిక సిడిపిఒ బి.అనంతలక్ష్మి తెలిపారు. మండలంలోని పింద్రంగివలస అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీలకు సీమంతాలు బుధవారం నిర్వహించారు. అలాగే పౌష్టికాహారం అవశ్యకత, పరిశుభ్రం గురించి వివరించారు. అవసరమైతే గర్భిణీలు వైద్యుల సలహాలు, సూచనలు తీసుకుని జాగ్రత్తలు పాటించాలన్నారు. వైయస్సార్ ఎస్పీ కిట్లు, బాలామృతం ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.వీరయ్య, అంగన్వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, పలువురు గర్భిణీలు పాల్గొన్నారు.

21న ఉద్యోగుల గ్రీవెన్స్

ప్రజాశక్తి - సీతంపేట

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెలా మూడో శుక్రవారం ఉద్యోగుల గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు ఐటిడిఎ పిఒ కల్పనకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా ఈనెల 21న ఉద్యోగుల గ్రీవెన్స్ నిర్వహిస్తామని తెలిపారు. గ్రీవెన్స్ శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి 1గంట వరకు ఉంటుందని తెలిపారు. తమ సమస్యలపై అర్జీలు సమర్పించాలనుకొన్న ఐటిడిఎ పరిధిలో గల ఉద్యోగులు నిర్దేశించిన సమయంలో హాజరుకావాలని కోరారు.

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం పార్వతీపురంలోనే ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - బెలగాం

ఆగస్టు 9 ప్రపంచ ఆదివాసీ దినోత్సవం పార్వతీపురం ఐటిడిఎ పరిధిలోని నిర్వహించాలని పల్ల సురేష్, దుక్క సీతారాం, ఆరిక చంద్రశేఖర్, మంచాల పోరమ్మ, కోలక గౌరమ్మ కోరారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ దినోత్సవం రోజున గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలతో గిరిజనులను గౌరవిస్తూ, గిరిజన నాయకులను, పెద్దలను సంప్రదింపులు చేసి ఆ వేదికపై గిరిజన నాయకులు మాట్లాడానికి అవకాశాలు ఇవ్వాలని కోరారు. అలాగే రాజకీయాలకు అతీయతంగా ఆదివాసీ గిరిజనులతో సాంస్కృతిక, సాంప్రదాయకంగా ఉత్సవాలు ఘనంగా పార్వతీపురంలో నిర్వహించాలని కోరారు.

జాగ్రత్తలు పాటించకుంటే రోడ్లకు నష్టమే

దమ్ములకు సిద్ధం చేస్తున్న ట్రాక్టర్లు

రోడ్ల భద్రతపై ఆర్అండ్‌బి, పోలీస్ శాఖ దృష్టిసారించాలి

ప్రజాశక్తి - మక్కువ

తొలకరి పలకరించడంతో రైతులు తన పొలాల్లో నాట్లు వేసేందుకు సిద్ధం అవుతున్నారు. ఇదే సందర్భంలో ట్రాక్టర్లతో దమ్ములు చేయాల్సిన పరిస్థితి. అయితే ట్రాక్టర్ యజమానులు ట్రాక్టర్లకు దమ్ము చేసే ఇనుపచక్రాలను అమర్చుకోవడానికి సిద్ధమవుతున్నారు. ఈ తరుణంలో కనీస జాగ్రత్తలు పాటించకుంటే రహదారులు పాడయ్యే పరిస్థితి ఉంది. గత ఏడాది మక్కువ పోలీసులు రహదారి భద్రతపై పలు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ ఏడాది కూడా మండలంలోని ట్రాక్టర్లు యజమానులకు మరోసారి అవగాహన కల్పించి అప్రమత్తం చేయాల్సిన పరిస్థితి పోలీసు శాఖపై ఉంది. ఆర్అండ్‌బి అధికారులు కూడా రహదారుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపించాల్సి ఉంది. మండలం కేంద్రం నుండి ఇతర గ్రామాలకు వెళ్లే రహదారులు చాలావరకు కొత్తగా నిర్మించినవే కావడంతో దమ్ము చక్రాలతో కూడిన ట్రాక్టర్లను రహదారులపై నడవడంతో దాదాపు అవి పూర్తిస్థాయిలో దెబ్బ తినే పరిస్థితి ఉంది. ఇప్పటికే నీటి వనరులు ఉన్న పొలాల్లో ఊబాలు మొదలయ్యాయి. కొంతమంది ట్రాక్టర్లు డ్రైవర్ల నిర్లక్ష్యం కారణంగా మండలంలోని విజయరాంపురం, దబ్బగెడ్డ రహదారి స్వల్పంగా దెబ్బతింది. గతేడాది పాటించాల్సిన జాగ్రత్తలు ఈ ఏడాది ట్రాక్టర్ యాజమానులు పాటించకపోవడంతో వారి నిర్లక్ష్యాన్ని తెలియజేస్తుంది. ఇనుపు చక్రాలకు రక్షణ బెల్టు వేసేందుకు సమయం పడుతుందన్న నెపంతో యధాతధంగా ట్రాక్టర్లను రహదారులపై నడిపేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.



ఇనుప చక్రానికి బెల్టు తగిలిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్

ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. అలాగే నిర్లక్ష్యం వహించి రహదారులు పాడు చేసే వారిపై చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారుజ

రోడ్లు బాగు చేయండి

ప్రజాశక్తి - సీతానగరం

మండల కేంద్రంలోని బస్టాండ్ నుంచి అజ్జాడ వరకు వెళ్లే రోడ్డు గోతులమయంగా తయారైంది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అంతేకాక రోడ్డుకు ఇరువైపులా కాలువలు లేకపోవడంతో నీరు నిల్వ ఉండడంతో ఎక్కడికక్కడే గుమ్ములు తయారై ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్యపై ఇప్పటికే పలుమార్లు జిల్లా అధికారులకు, ప్రజాప్రతినిధులకు సమస్య తెలిపినప్పటికీ ఎవరూ పట్టించుకోవడంలేదని ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సత్వరం రోడ్లు బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పాచిపెంట : మండలంలోని కొటికిపెంట పంచాయతీ కొత్తవలస బిసి కాలనీ సిసి రోడ్డు వేసి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని ఆ కాలనీ వాసులు బి.సత్యనారాయణ, కె.దినేష్, బి.నూకరాజు, పి.పోలినాయుడు, ఎం.రమేష్, బి.వెంకటసత్యం అధికారులను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో వేసిన రోడ్డు పూర్తిగా నాశనమైందని, వెంటనే సిసి రోడ్డు వేసి ఈ గుమ్ములు కప్పి ప్రజలకు రక్షణ కల్పించాలని కోరారు. లేకుంటే చిన్నపాటి వర్షాలకు ఇటువంటి నీరు ఏర్పడి దోమలతో అనారోగ్యం పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు యుద్ధ ప్రాతిపదికన సిసి రోడ్డు మంజూరు చేసి తమ కాలనీకి ప్రజలకు రక్షణ కల్పించాలని ప్రభుత్వానికి, అధికారులకి విజ్ఞప్తి చేశారు. సమస్య పరిష్కారం చేయకపోతే ఎంపిడిఒ కార్యాలయం దగ్గర ఆందోళన చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు.



చెరువును తలపిస్తున్న సీతానగరం ప్రధాన రహదారి



సమావేశంలో మాట్లాడుతున్న డిడి శ్రీనివాసరావు

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి - కురుపాం

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేకత తీసుకోవాలని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం స్థానిక ఎటిడబ్ల్యూఒ కార్యాలయం మండలంలో గల గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వసతి గృహ సంరక్షణ అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త మెనూ సక్రమంగా అమలు చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు రుచికరమైన భోజనం అందించాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా చూసుకోవాలన్నారు. అలాగే సబ్జెక్టులకు ఉపాధ్యాయుల కొరత ఉంటే వెంటనే తనకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమావేశంలో ఎంఇఒ ఎన్.సత్యనారాయణ, ఎటిడబ్ల్యూఒ కె.చంద్రబాబు పాల్గొన్నారు.

సమగ్ర సస్యరక్షణతో తెగుళ్ల నివారణ

ప్రజాశక్తి - పాచిపెంట

పత్తి పంటలో సమగ్ర సస్యరక్షణ చర్యల ద్వారా పురుగులు, తెగుళ్లను అరికట్టవచ్చని, పర్యావరణానికి ఎలాంటి హాని జరగకుండా మిత్ర పురుగులను సంరక్షించుకుంటూ ఖర్చును తగ్గించుకొని దిగుబడిని పెంచేటందుకు సమగ్ర సస్యరక్షణ చర్యలు ఎంతగానో దోహదం చేస్తాయని మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు అన్నారు. అమ్మవలసలో డాక్టర్ వైయస్సార్ పొలంబడి కార్యక్రమంలో మాట్లాడుతూ జీవన ఎరువుల వినియోగం, కాండంపై పురుగుమందు, పూత జిగురు పల్లాలు ఏర్పాటు పక్షిస్తావరాలు ఏర్పాటు, లింగాకర్షక బుట్టలు ఏర్పాటు, అంతర్ పంటలు వేయడం, ఎర్ర పంటలు, కంచె పంటలు ఆచ్ఛాధనతో కలుపు నివారణ తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. అలాగే కొసలు తుంచి వరి నాట్లు వేసుకోవడం ద్వారా మొక్కల సాంద్రతను సరిపడినంత ఉంచడమే కాకుండా కాండం తొలుచు పురుగును గుడ్డు దశలోనే నివారించుకోవచ్చు సూచించారు. పాంచాలిలో రైతు కర్రి సత్యం పొలంలో వరి నారు కొసలు తుంచి వరుసల్లో నాట్లు వేయించారు. 200 కేజీల పశువుల గెత్తంలో లీటరు నీటిలో కరిగే పొటాష్ బ్యాక్టీరియాను కలిపి పొలంలో చల్లుకోవడం వల్ల పంటకు అతి తక్కువ ఖర్చుతో పోటాష్ అందించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో విఎఎలు మోహనకృష్ణ, శ్రీను, రైతులు పాల్గొన్నారు.

ఏగోటివలసలో రైతులకు శిక్షణ

సీతానగరం: మండలంలోని ఏగోటివలసలో గ్రామీణ విత్తన ఉత్పత్తి పథకంలో భాగంగా రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని డిఆర్‌సి ఎడిఎ శారద ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సరైన విత్తన యాజమాన్య పద్ధతులు పాటించాలని, విత్తన సమయంలో విత్తన సుడోమను 10 గ్రాములు కేజీ విత్తనాలు కలిపి వేయడం వల్ల తొలి దశలో ఆశించిన తెగులు, పురుగుల బారిన పడకుండా ఉంటుందన్నారు. అలాగే రెండు డాష్ 3 మొలకలు ఒక కుదురులు చొప్పున 33 చదరపు కుదిరిలో వచ్చేలా నాట్లు వేయాలన్నారు. దీనివల్ల గాలి, వెలుతురు బాగా తగిలి అధిక దిగుబడి వస్తాయన్నారు. విత్తన ఉత్పత్తి పథకంలో పండించే వరి పంటకు, సాధారణ పంటకు కనీసం మూడు మీటర్ల దూరం ఉండాలన్నారు. ఇలా చేయడం వల్ల పంటలు ఏపుగా పెరుగుతాయన్నారు. మండల వ్యవసాయాధికారి ఎస్.అవినీష్ మాట్లాడుతూ ఎస్‌విబి పథకం కింద ఫౌండేషన్ విత్తనం ఇవ్వడం జరుగుతుందని, వీటిని మూడు కాలంలో వరకు విత్తనం కోసం ఉపయోగించుకోవచ్చన్నారు. అలాగే వరి నాట్లు వేసే సమయంలో ప్రతి 2 మీటర్లకు 20 సెంటీమీటర్లు చొప్పున కాలిబాటలో తీయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కురిటి రాధాకృష్ణ, విఎఎలు, రైతులు పాల్గొన్నారు.

నారుమడుల్లో నీరు నిల్వ ఉండరాదు

సాలూరురూరల్ : వరి నారుమళ్లలో నీరునిల్వ ఉండకూడదని మండల వ్యవసాయాధికారి అనురాధా పండా అన్నారు. మండలంలోని మామిడిపల్లిలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులనుద్దేశించి మాట్లాడుతూ ముఖ్యంగా వర్షాకాలంలో వరి నారుమడుల్లో స్వల్పకాలికంగా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. తగు మోతాదులో ఎరువు లను వేయాలన్నారు. నాట్లు వేసేముందు ఆకు చివర్లను తొలగించాలన్నారు. దీనివల్ల పంట పలు తెగుళ్ళు, కీటకాల బారి నుంచి బయట పడుతుందన్నారు. అనంతరం స్థానిక వ్యవసాయ సిబ్బంది, రైతులతో కలిసి వైఎస్ఆర్ పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో విఎఎ సంధ్య, రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పలుచోట్ల టిడిపి శిక్షణ తరగతులు

ప్రజాశక్తి -భామిని

పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో ఇంటిగ్రేట్ శిక్షణా తరగతులు బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో నిర్వహించారు. ఈ తరగతుల్లో ఓటర్ల పరిశీలన, కొత్త ఓట్లు చేర్పులు, మరణాలు, దొంగ ఓట్లపై పరిశీలన చేయాలని జయకృష్ణ సూచించారు. ఈనెల 21 నుంచి బిఎల్వోలతో కలిసి పని చేయాలన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు భోగాపురపు రవినాయుడు, ప్రధాన కార్యదర్శి మెడిబోయిన జగదీశ్, మాజీ ఎంపిపి భూపాతి ఆనందరావు, బిడ్డికి ప్రసాద్, కోరాడ రాజేష్, కొల్ల మధు, క్లస్టర్, యూనిట్, బూత్ కన్వీనర్లు, బూత్ ఏజెంట్లు, వివిధ పంచాయతీల టిడిపి నాయకులు పాల్గొన్నారు.

సీతంపేట : పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో ఇంటిగ్రేట్ శిక్షణా కార్యక్రమం స్థానిక టిడిపి కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బిడ్డిక చంద్రరావు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు సవరతోట మొఖ లింగం, బిసి సెల్ అధ్యక్షులు ఆర్.రంగ నాథం, ఎస్సీ సెల్ అధ్యక్షులు గంటా సుధా, క్లస్టర్, యూనిట్, బూత్ కన్వీనర్లు, ఏజెంట్లు, పాల్గొన్నారు.



ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్న సారా కేన్లు

సారా రవాణాపై దాడులు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఎన్ఫోర్స్మెంట్ ఇన్స్పెక్టర్ ఎల్.ఉపేంద్ర ఆధ్వర్యంలో ఒడిషా నుంచి ఆంధ్రా ప్రాంతానికి నాటుసారా రవాణా జరుగుతుందన్న సమాచారంతో మండలంలోని కొత్తూరు సమీపంలో కొండ మార్గాన వస్తున్న నాటుసారా క్యాన్లతో ఉన్న సైకిళ్లను వెంబడించగా కొంత దూరంలో తమ సిబ్బందిని చూసి సారాను విడిచిపెట్టి నిందితులు పారిపోయారు. దీంతో ఏడు సైకిళ్లను సీజ్ చేసి 320 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. ఒడిషాకు చెందిన నాటు సారా సరఫరాదారులు ఉయక సుబ్బు, ఉయక మల్లేసుపై కేసు నమోదు చేసినట్టు సిఐ తెలిపారు. అలాగే పార్వతీపురం పట్టణానికి చెందిన మరో ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఎస్ఐ రమణ, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

2300 లీటర్ల నాటు సారా ధ్వంసం

జిల్లా స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గత రెండు నెలలలో 50 కేసుల్లో పట్టుబడి, సీజ్ చేసిన 2300 లీటర్ల నాటుసారాను మంగళవారం రాత్రి పట్టణ శివారులో గల నవిరి కాలనీ సమీపంలో పాత తోటపల్లి రోడ్డులో ఎన్ఫోర్స్మెంట్ సూపరింటెండెంట్ ఆర్.సుధాకర్ ఆధ్వర్యంలో ధ్వంసం చేసినట్టు సిఐ ఎల్.ఉపేంద్ర విలేకరులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఇబి సిబ్బంది పాల్గొన్నారు.